క్లుప్తంగా

ఉగాది ఉత్సవ పోటీలు ప్రారంభం


కూచిపూడి నృత్యం చేస్తున్న చిన్నారులు

సామర్లకోట: స్థానిక సకల కళాసమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం వివేకానంద గ్రంథాలయంలో ఉగాది ఉత్సవ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను సినీ దర్శకుడు కేబీ ఆనంద్ ప్రారంభించారు. ఉగాది సంబరాలకు సంబంధించి కూచిపూడి, భరత నాట్యం, దేశభక్తి గీతాలు, ఏకపాత్రాభినయం, కోలాటం, జానపద నృత్య పోటీలు నిర్వహించారు. వీరి నుంచి మూడు బృందాల చొప్పున ఎంపిక చేసి ఉగాది రోజు సాయంత్రం స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో తిరిగి ప్రదర్శనలు నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహు మతులు అందజేయనున్నట్టు ఆనంద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సకల కళా సమాఖ్య అధ్యక్షుడు బడుగు బాబీ, కార్యదర్శి జి.రాజు, కోశాధికారి ఎ ప్రసాద్, మాజీ కౌన్సిలర్ కాపుగంటి పైడిరత్నం, మార్ని రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

చదువుతో ఆటలకూ ప్రాధాన్యం ఇవ్వాలి


కరాటే పోటీలో బహుమతులు పొందిన విద్యార్థులతో లయన్స్ క్లబ్ ప్రతినిధులు

సామర్లకోట: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని లయన్స్ క్లబ్ జిల్లా రెండో వైస్ గవర్నర్ ఈదల ఈశ్వరకుమార్ అన్నారు. స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో ఆదివారం స్థానిక కరాటే పాఠశాల విద్యార్థులు ఇటీవల ఆన్‌లైన్‌లో నిర్వహించిన పరీక్షల్లో విజేతలుగా నిలిచారు. వారికి ఆదివారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈశ్వర కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలను నిత్యం ఒక గంట పాటు ఆటలు ఆడేలా చూడాలన్నారు. దీంతో వారిలో మానసిక ఉత్సాహం కలుగుతుందని చెప్పారు. లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ చిత్తూలూరి వీర్రాజు మాట్లాడుతూ 10 ఏళ్లుగా సామర్లకోట పరిధిలోని చిన్నారులకు కరాటేలో శిక్షణ ఇవ్వడానికి లయన్స్ క్లబ్ ప్రోత్సహిస్తోందని చెప్పారు. కరాటే కోచ్ డి.శంకరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు పతకాలు, సర్టిఫికేట్లు అందజేశారు. సొసైటీ అధ్యక్షుడు మేకా శ్రీనివాసరావు, కౌన్సిలర్ యార్లగడ్డ జగదీష్, బాస్కెట్ బాల్ కోచ్ గోపాల్, లయన్స్ క్లబ్ విశ్రాంత కార్యదర్శి ప్రత్తి రామలక్ష్మణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు ఆధార్ శిబిరాలు

కాకినాడ: ఆధార్‌లో మార్పులు చేర్పుల కోసం సోమ, మంగళవారాల్లో రెండు రోజులపాటు కాకినాడలో ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహించనున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్ చెప్పారు. ప్రధానంగా పాత ఆధార్‌కార్డులలో ఉన్న పాత తూర్పుగోదావరి జిల్లా స్థానంలో కాకినాడ జిల్లాగా మార్పు చేసుకోవడంతో పాటు ఇతర మార్పులు, చేర్పులకు ఈ శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. ఆధార్‌కు మొబైల్ నెంబర్, మెయిల్ ఐడీ అనుసంధానం, చిరునామాలు, పుట్టిన తేదీల్లో మార్పులు, ఇతర సేవలు కూడా పొందవచ్చునన్నారు. ఆయా సేవలకు సంబంధించి నిర్ణీత సొమ్ము చెల్లించాల్సి ఉంటుందని కమిషనర్ స్పష్టం చేశారు.

ప్రత్యేక శిబిరాలు ఇవే: కాకినాడ నగరంలోని కృష్ణనగర్-2ఎ, డైరీఫారం-11ఎ, గోళీలపేట -14ఎ, యానాం రోడ్డు-15ఎ, చిన్నమార్కెట్ - 21ఎ, యాళ్లవారి వీధి-28బి, జగన్నాథపురం-30బి, బ్యాంక్‌పేట 32ఎ, గాంధీనగర్-38ఎ, రామారావుపేట-40బి, గైగోలుపాడు-50బి సచివాలయాలలో ఈ శిబిరాలు కొనసాగుతాయన్నారు.

లయన్స్ రీజినల్ కాన్ఫరెన్స్


వేడుకలను ప్రారంభిస్తున్న డాక్టర్ బాదం బాలకృష్ణ

బాలాజీచెరువు: లయన్స్ జిల్లా 316 బి రీజియన్-4 కాన్ఫరెన్స్ వేడుకలు స్థానిక చల్లా కల్యాణ మండపంలో స్నేహామృతం పేరిట నిర్వహించారు. రీజియన్ చైర్‌పర్సన్ వడ్డాది జ్యోతి, శ్రీనివాసరాజు దంపతులు, డాక్టర్ బాదం బాలకృష్ణ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ బాదం బాలకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో పలు సేవాకార్యక్రమాలు చేసిన అర్హత ఉన్న క్లబ్‌లకు, లయన్ సభ్యులకు వడ్డాది జ్యోతి అవార్డుల ప్రదానం చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథులుగా ఐపీడీజీ ముంజులూరి విశ్వేశ్వరరావు, వీడీజీలు వేలూరి సూర్యనారాయణ ఈవీవీ ఈశ్వర కుమార్ పాల్గొన్నారు. కమిటీ చైర్‌పర్సన్ ఆర్‌వీ రమణమూర్తి, హోస్ట్ క్లబ్ పీఎస్‌టీలు టీవీఎస్ దుర్గేష్, సుధాకర్ గుప్తా, దుర్గాప్రసాద్, రీజియన్ కార్యదర్శి గీతా మాధవి, సుమారు 200 మంది సభ్యులు పాల్గొన్నారు.

చినుకు పడితే మడుగే..

- చిన్నపాటి వర్షానికే చెరువుగా మారుతున్న పిఠాపురం
- అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ
- ఇబ్బంది పడుతున్న ప్రజలు


వర్షం వస్తే చెరువులా, మురుగు కూపంలా మారుతున్న పిఠాపురం మెయిన్ రోడ్డు

పిఠాపురం: పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. చినుకు పడితే చాలు చెరువుగా మారుతుంది. గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో ప్రధాన రోడ్లు చెరువులుగా మారాయి. సాధారణ పరిస్థితుల్లోను మురికి నీరు వెళ్లే పరిస్థితులు కనిపించడం లేదు. మున్సిపల్ అధికారులు ఏదో మొక్కుబడిగా డ్రైన్లను క్లీన్ చేయడం తప్ప శాశ్వత పరిష్కారం వైపు దృష్టి సారించడం లేదు.

మురుగునీరు నిలిచిపోయి..

పట్టణంలోని డ్రైన్లు పూడుకుపోయి మురుగు పారడం లేదు. అవుట్‌లెట్లు లేక ఎక్కడనీరు అక్కడే నిలిచిపోతోంది. పంట కాలువలు మురుగు కాలువలుగా తయారయ్యాయి. డ్రైవర్స్ కాలనీ, సకలయ్య చెరువు, మోహన్‌నగర్, జగ్గయ్యచెరువు ప్రాంతాలు మురుగుతో దుర్గంధం వెదజల్లుతోంది. ఆ ప్రాంతంలో పిల్లలు, పెద్దలు అనారోగ్యాలకు గురవుతున్నారు. కూలీ డబ్బులు ఆస్పత్రి ఖర్చులకు సరిపోతున్నాయని కాలనీ వాసులు వాపోతున్నారు. వారానికి ఒకసారి కూడా కాలువల్లో పూడిక తీయని పరిస్థితి నెలకొంది. దీంతో డ్రైన్లు రోగాల వ్యాప్తి కేంద్రాలుగా తయారవుతున్నాయి. మున్సిపాలిటీ లెక్కల ప్రకారం పట్టణంలో 32 మురికివాడలున్నాయి. 172 కిలోమీటర్ల నిడివిలో పక్కా డ్రైన్లు, 71 కిలోమీటర్ల పొడవున కచ్చా డ్రైన్లు పట్టణంలో ఉన్నట్టు అధికార లెక్కలు చెబుతున్నాయి. వీటికి కనీస మరమ్మతులు కూడా చేయడం లేదు. కచ్చా డ్రెయిన్ల పరిస్థితి మరీ దయనీయంగా మారింది.

పూడిక తొలగించకపోవడంతో..

మురుగుకాలువల్లో పూడికను తొలగించకపోవడంతో వర్షం వస్తే రోడ్లు జలమయమవుతున్నాయి. మెయిన్‌రోడ్డులోని చర్చిసెంటర్, అంబేడ్కర్ సెంటర్, సినిమా సెంటర్, పోలీస్‌స్టేషన్ సెంటర్‌లో కాలువల్లోకి మురుగునీరు చేరక రోడ్లపై నిలిచిపోతుంది. శివారు ప్రాంతాల్లో మురుగు కాలువలు లేకపోవడంతో అక్కడి పరిస్థితి దారుణంగా ఉంది. ఏలేరు ఆయకట్టులోని శివారు భూములకు సాగు నీరు అందించే ప్రధాన చెరుకుల కాలువ పట్టణం మధ్యలో ఉంది. ఈ కాలువకు కరపవారి కాలువ, ఈదురు చేను కాలువతోపాటు పలు ఉప కాలువలున్నాయి. ప్రస్తుతం ప్రధాన చెరుకుల కాలువతో పాటు, ఉప కాలువ పట్టణంలో మురుగు కాలువలుగా మారాయి. ఈ పంట కాలువల్లో చెత్త పేరుకుపోయింది. డ్రెయిన్లలో పూడికతీత పనులు తూతూ మంత్రంగా పనులు చేస్తున్నారు. ఎంపిక చేసిన ప్రాంతాల్లోని కాలువల్లోనే పూడికను సామూహిక సిబ్బందితో తీయిస్తున్నారు. తీసిన పూడికను అక్కడే వేస్తున్నా ఎండిన తరువాత తొలగించడం లేదు. వర్షం వస్తే తిరిగి పూడిక కాలువల్లోకి చేరిపోతోంది.

కాలువల నిర్మాణాలకు ప్రాధాన్యం

పట్టణం అభివృద్ధికి వివిధ పథకాల ద్వారా మంజూరయ్యే నిధుల్లో మురుగు కాలువల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తున్నాం. ఎక్కడ నీరు నిలిచిపోయి రోడ్లు పాడవుతున్నాయో ఆయా ప్రాంతాల్లో తక్షణ చర్యలు తీసుకుంటాం. మెయిన్ డ్రైన్లు పూర్తిగా అభివృద్ధి చేయడం ద్వారా ఈ సమస్య పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటున్నాం.

–ఎం.రామ్మోహన్, కమిషనర్, పిఠాపురం మున్సిపాలిటీ

సుస్థిర లక్ష్యాల సాధనపై నేటి నుంచి శిక్షణ

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో సోమవారం నుంచి రెండు రోజు పాటు పూర్వపు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలోని టీఓటీలకు శిక్షణ ప్రారంభిస్తున్నట్టు సీనియర్ ఫ్యాకల్టీ ఎంఎస్‌ఎస్ రెడ్డి తెలిపారు. పేదరికం నిర్మూలనలో భాగంగా చేయవలసిన అంశాలపై సుస్థిర లక్ష్యాల సాధనపై శిక్షణ ఉంటుందన్నారు. ఇప్పటికే సీఎం జగన్ అమలు చేస్తున్న నవరత్నాలు దీనిలోకి వస్తాయని చెప్పారు. ఆయా జిల్లాలకు చెందిన జెడ్పీ సీఈఓలు టీఓటీలను ఎంపిక చేసి పంపనున్నారు. వీరిలో ఎంపీడీఓ, ఈఓపీఆర్డీ, మండల ఇంజినీరు, సీనియర్ పంచాయతీ కార్యదర్శులు ఉంటాయన్నారు. శిక్షణ పొందిన వారు ఆయా జిల్లాల్లో తిరిగి శిక్షణ ఇవ్వవలసి ఉంటుందని తెలిపారు.

బాధితులకు ఆర్థిక సాయం

కొత్తపల్లి: అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలను ప్రభుత్వం తరఫున అన్ని విధాలా ఆదుకుంటామని సర్పంచ్ శ్రీరం పెదఅప్పారావు అన్నారు. యండపల్లికి చెంది కొండ చంటిబాబా, కొండ గన్నిబాబు, కొండ వీరబాబు తాటాకిట్లు ప్రమాదవశాత్తూ కాలిబూడిదయ్యింది. నిరాశ్రయులైన ఆ బాధిత కుటుంబాలను సర్పంచ్ పరామర్శించి రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఉప సర్పంచ్ గుండ్ర చిన్నారావు, గుండ్ర జగ్గారావు, కార్యదర్శి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక


తాటిపర్తిలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పిఠాపురం: గత స్మృతులను నెమరువేసుకుంటూ 26 ఏళ్ల తరువాత వారంతా కలుసుకున్నారు. ఆప్యాయంగా పలకరించుకుంటూ రోజంతా సందడి చేశారు. వారి ఆనందానికి స్థానిక కల్యాణ మండపం వేదికయ్యింది. గొల్లప్రోలు మండలం తాటిపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1996–97వ సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. గత జ్ఞాపకాలను తలచుకున్నారు. ఏటా ఇలా కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు. తమకు చదువు చెప్పిన గురువులు జి.నాగేశ్వరరావు, మీరాషబీలను సత్కరించారు. ఈ కార్యక్రమానికి సీలా శ్రీనుబాబు, దాసం వెంకటరమణ, గారపాలి శ్రీనివాస్, బవిరిశెట్టి మాణిక్యం తదితరులు ఈ ఆర్గనైజేషన్ చేశారు.

22 నుంచి వసంత నవరాత్రులు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వర స్వామి ఆలయంలో 22వ తేదీ ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని వసంత నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ డి నాగమల్లేశ్వరరావు తెలిపారు. బుధవారం ఉదయం విఘ్నేశ్వర పూజతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. ఈ నెల 30 వరకు ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం పూజలు జరుగుతాయని తెలిపారు. ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే కుంకుమ పూజలు జరుగుతాయని భక్తులు గమనించాలన్నారు. ఉత్సవాలు ముగిసే ఏప్రిల్ ఒకటో తేదీన మధ్యాహ్నం స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలతో సింహ వాహనంపై గ్రామోత్సవం జరుగుతుందని తెలిపారు.

నేడు కార్పొరేషన్‌లో స్పందన

కాకినాడ: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి సోమవారం ఉదయం 10 గంటలకు స్పందన నిర్వహించనున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్ చెప్పారు. ఉదయం 10 గంటలకు కార్పొరేషన్ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

వేపతో వెయ్యి లాభాలు


పువ్వుతో నిండుగా ఉన్న వేప చెట్లు

- ఆయుర్వేద, గృహ వైద్యంలో వాడకం
- ఆధ్యాత్మికంగానూ హిందువులకు ఆరాధ్యం

సామర్లకోట: ఔషధ గుణాలున్న చెట్లలో వేపది ప్రథమస్థానం. గ్రామీణులు ఉదయం లేస్తూనే పళ్లు తోమడానికి వేప పుల్లతో రోజు మొదలుపెడతారంటే ఈ చెట్టు ఎంత ఔషధ విలువలు కలిగి ఉందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఆధ్యాత్మికంగానే కాకుండా ఆయుర్వేద పరంగా ఈ చెట్టు భారతీయులకు ఎంతో ప్రత్యేకమైనది. ఉగాది పండగ వస్తోందంటే తెలుగువారు ముందుగా వెదికేది వేప పువ్వు కోసమే. జీర్ణ వ్యవస్థను గాడిలో పెట్టడానికి వేప రసాయనం ఎంతో ఉపయోగపడుతుందంటారు.

ఇంటి ఆవరణలో ఉంటే ఎంతో మేలు..



ప్రతి ఇంటి ఆవరణలో వేప చెట్టును పెంచుకోవడం ఎంతో మేలు. కొద్ది సమయం వేప చెట్టు కింద నిద్రించడం, ఆ గాలి పీల్చడం ఆరోగ్యానికి ఎంతో మేలు. ఉగాది రోజున వేప పువ్వు పచ్చడి తినడం వలన ఆరోగ్యానికి మేలు చేస్తుంది.

– డాక్టరు పసల సత్యానందరావు, సామర్లకోట

దోషాలు పోవాలంటే దున్న తొక్కాల్సిందే..

- అమీనాబాద్‌లో విచిత్రమైన ఆచారం
- నేడు పోలేరమ్మ తల్లి తీర్థం


పడుకున్న భక్తులపై దున్నపోతును నడిపిస్తున్న ఉపవాస దీక్షలో ఉన్న మహిళ (ఫైల్)

కొత్తపల్లి: అదొక మత్స్యకార గ్రామం. అక్కడ ఒక అమ్మవారి జాతర జరుగుతోంది. భక్తులందరూ స్నానాలు చేసి అమ్మవారి ఆలయం ముందు సాష్టాంగపడ్డారు. ఇంతలో ఒక దున్నపోతును తీసుకువచ్చి వారిని తొక్కించుకుంటూ నడిపించారు. ఇదంతా చూస్తున్న వారికి ఆశ్చర్యకరమే అయినప్పటికీ అక్కడి వారికి మాత్రం అది ఒక ఆచారం. అది పాటించకపోతే గ్రామానికే అరిష్టమని నమ్ముతుంటారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి.. కొత్తపల్లి మండలం అమీనాబాద్ ఓ మత్స్యకార గ్రామం. ఈ గ్రామ దేవత పోలేరమ్మ జాతర ఏటా జరుగుతుంది. జాతరలో దున్నపోతును తీసుకువచ్చి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఉదయం నుంచి గ్రామస్తులు ఉపవాసంతో ఉండి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తారు. దున్నపోతును ప్రత్యేకంగా పూజిస్తారు. గరగ నృత్యాల మధ్య దున్నపోతును గ్రామమంతా ఊరేగించి ఆలయం వద్దకు తీసుకువస్తారు. ఉపవాసం ఉన్న భక్తులందరూ పసుపునీళ్లతో స్నానం చేసి అమ్మవారి ఆలయం ఎదురుగా పడుకుంటారు. వెంటనే ఆ దున్నపోతును తీసుకుని ఒక భక్తురాలు పడుకున్న వారి మీదుగా తీసుకెళుతుంది. అలా మూడు పర్యాయాలు దున్నపోతుతో తొక్కించుకుంటారు. అలా తొక్కడం వల్ల గ్రామానికి ఉన్న అరిష్టం పోవడంతో పాటు వారి కష్టాలు తొలగిపోతాయని నమ్మకం. ప్రతి ఏడాది క్రమం తప్పకుండా ఈ ఆచారాన్ని పాటిస్తుంటారు. అనంతరం ఆలయంలో అమ్మవారికి పసుపు, కుంకుమలతో పూజలు చేస్తారు. గరగ నృత్యాలతో గ్రామమంతా దద్దరిల్లిపోతుంది. ఆ రాత్రంతా జాగారం చేస్తారు. ఈ ఆచారాన్ని మండలంలో నలుమూలల నుంచి ప్రజలు తండోపతండాలుగా వచ్చి తిలకిస్తుంటారు.

నేడు పోలేరమ్మతల్లి తీర్థం

గ్రామ దేవతగా పిలువబడే పోలేరమ్మతల్లి తీర్థం సోమవారం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ సర్పంచ్ నక్క మణికంఠబాబు తెలిపారు. ఆదివారం రాత్రి పోలేరమ్మతల్లి జాతరను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరాతి సుందరంగా అలంకరించి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, గరగ నృత్యాలు ఏర్పాటు చేశారు.


పోలేరమ్మ తల్లి

నూకాలమ్మ జాతరకు వరుణ గండం

భక్తులకు ఇబ్బంది కలగకుండా ముందస్తు చర్యలు




ఆలయ సమీపంలో వర్షపు నీటితో నిండిన మైదానం

పెద్దాపురం: మండలంలోని కాండ్రకోట నూకాలమ్మ తల్లి జాతరను వరుణ గండం వెంటాడుతోంది. సోమవారం నుంచి 45 రోజుల పాటు నిర్వహించనున్న జాతరకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తిచేశారు. రెండు రోజులుగా ఏకధాటిగా కురుస్తున్న వర్షంతో జాతర ప్రాంగణం తడిసి ముద్దయ్యింది. ఆదివారం సాయంత్రానికే భక్తులు సుదూర ప్రాంతాల నుంచి అమ్మవారి దర్శనానికి వచ్చారు. ఆలయ కమిటీ, దేవదాయ శాఖాధికారులు ఇప్పటికే ముందస్తు చర్యలు చేపట్టి వర్షపు నీటిని బయటకు తోడించి, పారిశుధ్య పనులు మెరుగుపరచారు. ఆలయ కమిటీ, ఈఓ తలాటం వెంకట సూర్యనారాయణ ఆధ్వర్యంలో జాతర ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం రాత్రి 8.46 నిమిషాలకు ప్రారంభమయ్యే జాతర ప్రారంభోత్సవానికి ఎంపీ వంగా గీత, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పతో పాటు దేవదాయ శాఖ ఉన్నతాధికారులు హాజరుకానున్నారు.

అటెండర్.. చిత్రం వండర్!


- గీసిన ప్రతి గీతా కళాత్మకం
- డ్రాయింగ్ టీచర్ కావాలన్న కల కల్లయినా వీడని కళా తృష్ణ


వెంకటేష్


ఇందిరాగాంధీ


ఎన్టీఆర్


కళాతపస్వి కె.విశ్వనాథ్


చిరంజీవి

కాకినాడ రూరల్: చిత్ర కళకు ఆయన ఓ ఆభరణం. చేతి గీత చిత్తరువై మన్ననలొందుతుంది. పెన్సిల్, పెన్ను, బ్రష్ పరికరం ఏదైనా జాలువారేది మాత్రం ఓ చక్కని దృశ్య కావ్యమే అవుతుంది. వృత్తి రీత్యా అటెండరైనా ఎంతటి వారైనా ఆయన గీసిన చిత్రాలపై అటెన్షన్ పెట్టాల్సిందే. పెద్దాపురం మండలం కాండ్రకోటకు చెందిన రామకుర్తి వెంకటేష్ సుమారు 20 ఏళ్ల క్రితం కాకినాడకు వచ్చి స్థిరపడ్డారు. ప్రభుత్వ ఐటీఐలో విద్యనభ్యసించి అంబేడ్కర్ దూరవిద్య కళాశాలలో బీకాం చేశారు. అలాగే ఆయనకు ఇష్టమైన డ్రాయింగ్‌లో లోయర్, హయ్యర్‌తో పాటు టీటీసీ డ్రాయింగ్ పూర్తిచేశారు. డ్రాయింగ్ టీచర్ కావాలని కలగన్నప్పటికీ, అవి నెరవేరకపోవడంతో ఏడాది క్రితం స్థానిక రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో జోనల్ కార్యాలయంలో అటెండర్‌గా చేరారు. వృత్తి ఏదైతేనేం తన ప్రవృత్తిని సంతృప్తి పరచుకుంటూ ముందుకు సాగుతున్నారు. సహోద్యోగులు, ఉన్నతోద్యోగులు, అధికారుల ప్రోత్సాహం, మెచ్చుకోళ్లతో తన కళా ప్రావీణ్యాన్ని అందరికీ పంచుతూ సంతృప్తి చెందుతున్నారు. అటెండర్‌గా ఉన్నప్పటికీ ఏపీఐఐసీలో జెడ్‌ఎం హరిధరరావు తనను ఎంతో ప్రోత్సహిస్తుంటారని అంటారు వెంకటేష్. పోర్ట్రైట్, లాండ్‌స్కేప్ ఇలా ఏ చిత్రానైనా అవలీలగా చిత్రిస్తుంటారు ఆయన. దేశ నాయకులు, సినీ నటులు, పల్లెజీవనం ఇలా ఎన్నెన్నో చిత్రాలు ఆయనకు మకుటం లేని కీర్తికిరీటాన్ని తెచ్చిపెట్టాయి. కళాతపస్వి కె.విశ్వనాథ్ నటించిన, దర్శకత్వం వహించిన చిత్రాల పేర్లతో ఆయనకు చిత్ర నివాళులర్పించారు. ఏపీఐఐసీ గోల్డెన్ జూబ్లీ వేడుకల సందర్భంగా తాను గీసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటాన్ని గత ఏడాది సెప్టెంబర్ నెలలో ఆ సంస్థ ఎండీ జె.సుబ్రహ్మణ్యం ముఖ్యమంత్రికి బహూకరించడం ఎంతో ఆనందాన్నిచ్చిందంటారు చిత్రకారుడు వెంకటేష్.

కూన వ్యాఖ్యలపై యాదవుల ఆగ్రహం

కాకినాడ సిటీ: టీడీపీ నాయకుడు కూన రవికుమార్ మంత్రులు గొర్రెలు కాసే వారి కన్నా హీనమంటూ చేసిన ప్రకటన యాదవుల మనోభావాలను దెబ్బతీసేదిగా ఉందని జిల్లా యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మన్నే నాగేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో ఖండించారు. పార్టీల పరంగా మీరు, మీరు విమర్శించుకోండి కానీ యాదవుల్ని ఉపమానం చేసి యాదవులను అవమాన పరిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. యాదవుల ఆత్మాభిమానాన్ని దెబ్బతీసేలా ఎవరు ప్రవర్తించినా ఊరుకునేది లేదన్నారు.

ఏఎంవీఐపై దాడి బాధాకరం

- వైద్యుల కృషి అభినందనీయం
- చిన్నారావుకు ఎమ్మెల్యే ద్వారంపూడి పరామర్శ


ఏఎంవీఐ చిన్నారావు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: రవాణాశాఖ అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ చిన్నారావుపై కొంబరి బొండాల వ్యాపారి కత్తితో దాడిచేసిన తీరు అత్యంత బాధాకరమని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఏఎంవీఐ చిన్నారావును ఆయన ఆదివారం పరామర్శించారు. సూపరింటెండెంట్ హేమలతాదేవిని ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే ద్వారంపూడి విలేకర్లతో మాట్లాడుతూ ప్రశాంతతకు మారుపేరైన కాకినాడలో ఇటువంటి సంఘటన జరగడం ఎంతో బాధాకరమన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఏఎంవీఐ చిన్నారావు చిన్నారావు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కాగా ఏఎంవీఐకి సత్వర సేవలు అందించిన వైద్యులను ఆస్పత్రి ప్రతిష్ట పెంచేలా చేశారని వైద్యులను ఎమ్మెల్యే అభినందించారు. సుమారు 9 నుంచి 10 గంటల పాటు శ్రమించి చేసిన సర్జరీ ఆయనను ప్రాణాపాయం నుంచి తప్పించిందన్నారు. ఏఎంవీఐపై దాడి నేపథ్యంలో ఇకపై నగరంలో కొబ్బరిబొండాల వ్యాపారులు కత్తులను వినియోగించకుండా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి చెప్పారు. ఆ మేరకు పోలీసు, సంబంధిత శాఖల అధికారులతో చర్చించానన్నారు. కత్తితో పని లేకుండా యంత్రాలు ఏర్పాటు చేసి కొబ్బరి బొండాలు విక్రయించేలా చూడాలని నిర్ణయించామన్నారు. ఎమ్మెల్యే వెంట డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి, అసిస్టెంట్ ఆర్‌ఎంవో రాహుల్, ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్, పలువురు వైద్యులు ఉన్నారు. ఏఎంవీఐ డ్రైవర్‌ను కూడా ఎమ్మెల్యే ద్వారంపూడి పరామర్శించారు.

GENERAL PUBLICATION

Under instructions from our client, Shriram Finance Ltd. registered office at Chennai and branch office at II floor, Super Bazar Complex, Main Road, Kakinada, we issue this notice to the general public.

Our client is intending to advance loan to Sri Voluju Rajkumar, S/O Tatababu who agreed to create equitable mortgage relating to the undermentioned schedule property belongs to them.

The public is hereby informed that if anybody has got any objection in respect of the mortgage of the schedule property, kindly contact undermentioned address within one week. Otherwise, the same is treated as no objection.

Schedule:

Previously East Godavari District, presently Kakinada District, Pithapuram Sub-registry, Pithapuram Mandal, Pithapuram Municipality, Pithapuram town, S.No:2601, vacant site (After removing tiled and thatched houses thereon) bearing D.Nos:11-4-124 and 11-4-123 to an extent of 134 [illegible] sq.yards consisting of two items within the following boundaries with all easementary rights:

Item no:1: 80sq.yards vacant site:
East : 25 feet joint passage, West : 25 feet wall belonging to Volupu Krishna, South : 28.5 feet road, North : 26 feet house of Pachigolla Seshamma to some extent and remaining item no 2 herein.

Item no:2: 54 [illegible] sq.yards vacant site:
East : [illegible] feet house of [illegible], West : 28.5 feet house of Pachigolla Seshamma, South : [illegible] feet item no:1, North : [illegible] feet house of [illegible]

C.S.M.N.SWAMY, B.COM.,B.L. **C.A.S.S. JYOTHI**, B.L.
ADVOCATES,
D.No:8-24-8, BF:1, KAKINADA-4, Ph:9868191297.